సాక్షి
కుమురం భీం

బుధవారం ; 21 ; ఆగస్టు ; 2024



ఆర్టీసీకి రాఖీ కళ
రాఖీ పండుగను పురస్కరించుకుని ఆర్టీసీకి రికార్డుస్థాయి ఆదాయం సమకూరింది. రాఖీ పండుగ కావడంతో ప్రయాణికుల్లో అత్యధికులు మహిళలే ఉన్నారు. 8లో▸



మంప్స్ బెల్స్..!
జిల్లాలోని చాలామంది చిన్నారులు గవద బిళ్లలతో బాధపడుతున్నారు. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాల్లోని ఆస్పత్రులకు బాధితులు క్యూకడుతున్నారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
33.6 /26.3

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ద్రోణి ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

కబ్జాలపై కదలిక!

- కాగజ్‌నగర్ కమిషనర్‌పై కలెక్టర్ ఆగ్రహం
- మున్సిపాలిటీ భూముల అన్యాక్రాంతంపై విచారణ
- విచారణాధికారిగా ఆర్డీవో.. నివేదిక అందాక చర్యలకు సిఫార్సు
- 'సాక్షి' వరుస కథనాలపై స్పందించిన కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



కాగజ్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ స్థలం

సాక్షి, ఆసిఫాబాద్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన భూములు అన్యాక్రాంతమవుతున్నా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పురపాలక కమిషనర్ అంజయ్యపై జిల్లా కలెక్టర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రభుత్వ స్థలం పరుల పాలు!?', 'సర్కారు స్థలం కబ్జా!' అనే శీర్షికల పేరిట ఆది, సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వరుస కథనాలపై కలెక్టర్ వెంకటేశ్ దోత్రే స్పందించారు. రూ.కోట్ల విలువైన మున్సిపాలిటీ స్థలాలు కబ్జాకు గురికావడానికి కారకులు ఎవరో తేల్చేందుకు విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా కాగజ్‌నగర్ ఆర్డీవో సురేశ్‌ను నియమిస్తూ సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశించినట్లు తెలిసింది. మున్సిపల్ కమిషనర్ గత రెండు రోజులుగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు వచ్చి ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

ఆన్‌లైన్‌లో ఇంటి నంబరు తొలగింపు

మున్సిపాలిటీకి చెందిన స్థలాలు అన్యాక్రాంతంపై 'సాక్షి'లో వరుస కథనాలు రావడంతో కాగజ్‌నగర్ పురపాలక సంస్థ అధికారులు తప్పును సరిదిద్దే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంటి నంబరు కోసం రాపెల్లి భాగ్యలక్ష్మి అనే మహిళ గత నెల 13న దరఖాస్తు చేయగా.. ఆగమేఘాలపై ఐదు రోజుల్లో(18వ తేదీన) ఇంటి నంబరు కేటాయించిన మున్సిపల్ కమిషనర్ అంజయ్య.. 'సాక్షి' వివరణ కోరినప్పుడు మాత్రం ఆమె పహాణీ ద్వారా దరఖాస్తు చేసుకుందంటూ బుకాయించే ప్రయత్నం చేశారు. 'సాక్షి' సాక్ష్యాధారాలతో కుట్ర కోణాన్ని వెలికితీయడంతో అధికారులు ఇరకాటంలో పడినట్లు తెలుస్తోంది. కలెక్టర్ సైతం కన్నెర్ర చేయడంతో చివరికి ఆన్‌లైన్‌లో ఇంటి నంబరును మాత్రం తొలగించారు. కానీ రిజిస్టర్ అయిన డాక్యుమెంట్‌ను రద్దు చేయాలని కోరుతూ రిజిస్ట్రేషన్ శాఖకు లేఖ రాస్తానని పేర్కొన్న కమిషనర్.. మంగళవారం సాయంత్రానికి కూడా ఆ లేఖను పంపకపోవడం గమనార్హం.

కాగజ్‌నగర్ ఆర్డీవోకు విచారణ బాధ్యత

కబ్జాకు గురైన కాగజ్‌నగర్ పురపాలక సంస్థకు చెందిన మున్సిపల్ కాంప్లెక్స్ స్థలం, అనాథ పేదలకు నైట్‌షెల్టర్ కోసం కేటాయించిన స్థలాలపై విచారణ చేపట్టేందుకు ఆర్డీవో సురేష్‌ను కలెక్టర్ ఆదేశించారు. కోర్టు వివాదంలో ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్ స్థలానికి ఇంటి నంబరు ఎలా కేటాయించారు? అనాథల కోసం నిర్మించాల్సిన స్థలంలో ప్రహరీ నిర్మించిందెవరు? ఈ విషయాల్లో కుట్రదారులకు సహకరించిన మున్సిపల్ సిబ్బంది ఎవరు? అనే అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది. నిష్పక్షపాతంగా విచారణ జరిగితే కుట్ర వెనుక ఉన్నదెవరు? అన్నది తేలుతుందని స్థానికులు చెబుతున్నారు.

రీజినల్ డైరెక్టర్‌కూ సమాచారం..

కాగజ్‌నగర్‌లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిన అంశంపై ఒకవైపు విచారణకు ఆదేశించిన కలెక్టర్ అదే సమయంలో వరంగల్ మున్సిపల్ రీజినల్ డైరెక్టర్(సీడీఎంఏ)కు సమాచారం అందజేసినట్లు సమాచారం. మున్సిపాలిటీ అధికారుల ప్రమేయం లేకుండా రూ.కోట్ల విలువైన స్థలం అన్యాక్రాంతం కాదని.. ఈ కుట్రకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరినట్లు తెలుస్తోంది. ఆర్డీవో నివేదిక అందాక మున్సిపల్ కమిషనర్‌తోపాటు సహకరించిన సిబ్బందిపై వేటు పడే అవకాశం ఉంటుందని ఉద్యోగవర్గాలు పేర్కొంటున్నాయి.

కబ్జాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ కౌన్సిలర్ షబ్బీర్ హుస్సేన్

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ప్రభుత్వ భూముల కబ్జాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ షబ్బీర్ హుస్సేన్, నిరుద్యోగ జేఏసీ జిల్లా కన్వీనర్ పొన్న రమేశ్ కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కలిసి ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలోని స్థలంతోపాటు సర్వే నం .143 ఖాళీ స్థలాన్ని కొందరు ఆక్రమించారని ఆరోపించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం వెనుక సర్వే నం.267లో నాలుగో తరగతి ఉద్యోగుస్తుల కోసం ప్రభుత్వం 2008 సంవత్సరంలో ప్లాట్లు కేటాయించిందని, ఇందులో ఒక ప్రభుత్వ ఉద్యోగికి కేటాయించిన స్థలంలో కాకుండా ప్రభుత్వ స్థలంలో ఇల్లు లేకున్నా ఇంటి నం.1–16–501/6/2/ఎ/1 కేటాయించి, ఆ ఇంటికి విద్యుత్ మీటర్ కోసం తహసీల్దార్ 2023 జనవరి 27న ఎన్‌వోసీ ఇచ్చారని తెలిపారు.

సీఈవో సంతోష్‌పై సస్పెన్షన్ వేటు

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో అక్రమాల నేపథ్యంలో సీఈవో సంతోష్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఖాతాదారులకు తెలియకుండా వారి పేర్ల మీద బ్యాంకులో రుణాలు ఉండటం, చనిపోయిన ఖాతాదారుల పేర్ల మీద ఉన్న రుణాలను వారి సంతకాలు లేకుండానే ఏటా రెన్యువల్ చేయటం, రుణాలు పూర్తిగా చెల్లించి నో డ్యూ సర్టిఫికెట్లు పొందినా బాకీ ఉన్నట్లు చూపించటం వంటి ఆరోపణల నేపథ్యంలో జిల్లా 'సహకార' అధికారులు ప్రాథమిక విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా కొన్ని రకాల రికార్డులు పరిశీలించారు. ఆరోపణలు వాస్తవమేనని తేలడంతో సహకార చట్టం 59 ప్రకారం సీఈవో సంతోష్‌పై చర్యలు తీసుకోవాలని పాలకవర్గానికి ఆదేశాలు జారీ చేసినట్లు ఇన్‌చార్జి జిల్లా సహకార అధికారి బి.మోహన్ తెలిపారు. అలాగే రెబ్బెన పీఏసీఎస్ బాధ్యతలను కెరమెరి సీఈవో విజయ్‌కు తాత్కాలికంగా అప్పగించినట్లు వెల్లడించారు. ఇదే విషయంపై పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్‌ను వివరణ కోరగా.. సస్పెండ్ చేసినట్లు నిర్ధారించారు. ఇన్‌చార్జి జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు సీఈవోను సస్పెండ్ చేసి పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేస్తామని తెలిపారు.

విచారణ కమిటీ నియామకం

రెబ్బెన పీఏసీఎస్‌లో అవినీతి ఆరోపణలపై నిజ నిర్ధారణ కోసం విచారణ కమిటీని నియమించినట్లు ఇన్‌చార్జి జిల్లా సహకార అధికారి మోహన్ తెలిపారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ అనంతలక్ష్మి కమిటీకి నాయకత్వం వహిస్తుండగా.. సీనియర్ ఇన్‌స్పెక్టర్లు నవ్య, రాజ్యలక్ష్మి సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. సహకార సంఘంలో రుణాలు తీసుకున్న ఖాతాదారుల పూర్తి వివరాలను పరిశీలించడంతోపాటు రుణాల మొత్తం, చెల్లింపులు, ఇతర విషయాలపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక అందిస్తామని స్పష్టం చేశారు.

ప్రభావిత ప్రాంతాల్లో చర్యలు చేపట్టాలి

ఆసిఫాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల రక్షణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అలాగే హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి భారీ వర్షాల సమయంలో ప్రజా సంక్షేమానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిశీలన, నూతన ఆర్‌ఓఆర్ చట్టం ముసాయిదాపై అభిప్రాయ సేకరణ అంశాలపై కలెక్టర్లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నియంత్రణపై జాగ్రత్తలు పాటించాలని, ప్రమాద సమయాల్లో తక్షణ చర్యలు చేపట్టేందుకు రెస్క్యూ బృందాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ధరణి పోర్టల్‌లో అందిన దరఖాస్తులను గడువులోగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేశ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నాలుగు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జనజీవనానికి ఇబ్బంది లేకుండా రక్షణ చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రహదారులు, వంతెనలు, కాజ్‌వేలు, వాగుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషర్ భుజంగరావు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.


వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

'ఎల్‌ఆర్‌ఎస్' దరఖాస్తుల పరిశీలన

ఆసిఫాబాద్: జిల్లాలోని అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్‌ఆర్‌ఎస్– 2020 పథకంలో భాగంగా 2020 ఆగస్టు 26లోగా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు పరిశీలనకు చర్యలు చేపట్టామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల ద్వారా దరఖాస్తుల పరిశీలన, క్రమబద్ధీకరణ ప్రక్రియ కోసం సాంకేతిక బృందాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఆయా బృందాలు లేఅవుట్లలోని ప్లాట్లను పరిశీలించి క్రమబద్ధీకరణకు సిఫార్సు చేస్తాయని వివరించారు. దరఖాస్తుదారులకు సాయం అందించేందుకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. పూర్తి వివరాలకు 89192 43616 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. దరఖాస్తుదారుల అవసరమైన ధ్రువపత్రాలు ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌అర్బన్: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఒడ్డెపల్లి గార్డెన్‌లో మంగళవారం డీఎస్పీ సదయ్య, జిల్లా సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ రమేశ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండి తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులకు వివరించాలన్నారు. మన బలహీనతే నేరగాళ్ల బలమని అన్నారు. తక్కువ సమయంలో డబ్బులు సంపాదించాలనే ఆశ, ఇతరులతో వ్యక్తిగత విషయాలు పంచుకోవడం, ఓటీపీలు షేర్ చేయడం, ఆన్‌లైన్‌లో ఉద్యోగాల కోసం, కస్టమర్ కేర్ నంబర్లు వెతకడం, మొబైల్‌కు వచ్చే అనుమానిత లింక్స్‌ను క్లిక్ చేయడం తదితర కారణాలతో మోసాల బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. సెల్‌ఫోన్ అధిక వినియోగంతో కలిగే అనర్థాలు, విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అపరిచిత నంబర్ల నుంచి.. ఫేస్‌బుక్, వాట్సాప్ ద్వారా వచ్చే వీడియోకాల్స్‌కు స్పందించొద్దని అన్నారు. సైబర్ నేరాల బారినపడితే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని, www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో రిపోర్టు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీ రమేశ్, ఇన్‌స్పెక్టర్లు సతీష్, చిట్టిబాబు, రమేశ్, ఎస్సైలు విజయ్, చంద్రశేఖర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

'మాఫీ' సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

- ప్రత్యేకాధికారులను నియమించిన వ్యవసాయశాఖ

ఆసిఫాబాద్‌అర్బన్: రైతు రుణమాఫీ ప్రక్రియలో రైతుల సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణకు వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు మండలానికో ప్రత్యేకాధికారిని నియమిస్తూ జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు నిర్దేశించిన ప్రదేశంలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. రుణమాఫీలో సమస్యలు ఉన్న వారు మండలానికి కేటాయించిన అధికారికి ఫిర్యాదులు అందించాలని సూచించారు.

మండలాల వారీగా అధికారులు

మండలం	అధికారి	హోదా	ప్రదేశం
ఆసిఫాబాద్	మిలింద్‌కుమార్	ఎంఏవో	ఏడీఏ కార్యాలయం
రెబ్బెన	రాకేశ్	ఏఈవో	రైతువేదిక
వాంకిడి	గోపికాంత్	ఎంఏవో	ఎంఏవో కార్యాలయం
తిర్యాణి	వినోద్‌కుమార్	ఏఈవో	ఎంఏవో కార్యాలయం
జైనూర్	రాజేందర్	ఏఈవో	ఏడీఏ కార్యాలయం
కెరమెరి	బి.వెంకటి	ఏడీఏ	ఎంఏవో కార్యాలయం
సిర్పూర్(యూ)	ఆనంద్‌రావు	ఎంఏవో	రైతువేదిక
లింగాపూర్	ఖలీల్	ఏఈవో	రైతువేదిక
కాగజ్‌నగర్	రామకృష్ణ	ఎంఏవో	ఏడీఏ కార్యాలయం
సిర్పూర్(టి)	మధులత	ఎంఏవో	ఎంఏవో కార్యాలయం
కౌటాల	ఘనస్యాం	ఏఈవో	రైతువేదిక
చింతలమానెపల్లి	శ్రీనివాస్	ఏఈవో	రైతువేదిక
దహెగాం	మనోహర్	ఏడీఏ	ఏడీఏ కార్యాలయం
పెంచికల్‌పేట్	శ్రీవిద్య	ఏఈవో	రైతువేదిక
బెజ్జూర్	మారుతి	ఏఈవో	రైతువేదిక

సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులతో సమావేశం

ఆసిఫాబాద్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు సమష్టి కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం డీఎంహెచ్‌వో తుకారాంతో కలిసి జిల్లాలోని ప్రైవేట్ క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, నర్సింగ్ హోంల వైద్యులతో సీజనల్ వ్యాధుల నియంత్రణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన మలేరియా, డయేరియా, డెంగీ, చికున్‌గున్యా, టైఫాయిడ్ ఎక్కువ వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. జ్వరాల నియంత్రణకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు వైద్యం కోసం వచ్చే వారి నుంచి అవసరమైతే రక్తనమూనాలు సేకరించాలన్నారు. పాజిటివ్ రిపోర్టు వస్తే వారి వివరాలు ప్రతిరోజూ సాయంత్రం 4 గంటలకు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ప్రొఫార్మాలో సమర్పించాలని ఆదేశించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యసేవల ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దోమల నివారణకు నిరంతరాయంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో డీసీహెచ్ చెన్నకేశవ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆదిమ గిరిజనుల అభివృద్ధికి చర్యలు

ఆసిఫాబాద్: దేశంలోని ఆదిమ గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ సంచాలకుడు వైభవ్ గోయల్ తెలిపారు. మంగళవారం న్యూఢిల్లీ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో ప్రధానమంత్రి జన్‌మన్ పథకం నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహంచారు. ఆయన మాట్లాడుతూ ఆదిమ గిరిజనుల అభివృద్ధికి కోసం అర్హత కలిగిన వారికి పథకం ఫలాలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, డీఎంహెచ్‌వో తుకారాం, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ప్రధాన మంత్రి జన్‌మన్ పథకం కింద జిల్లాలో 3,615 గృహాల నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. గిరిజన గ్రామాలను జిల్లా కేంద్రానికి అనుసంధానం చేస్తూ రహదారులు అభివృద్ధికి చేస్తున్నామని తెలిపారు. గిరిజన ఆరోగ్య పరిస్థితులపై జిల్లా వైద్యారోగ్య శాఖ సమన్వయంతో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. పీవీటీజీల ప్రాంతాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలు, పాఠశాల భవనాల నిర్మాణంతోపాటు వారికి పోషక విలువలు కలిగిన ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ మీటర్ల ఏర్పాటు, సంచార వాహనాల ద్వారా వైద్యసేవలు, టవర్ల నిర్మాణం, కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

'బడి' తలుపులు తెరిచేదెప్పుడు..?

తిర్యాణి(ఆసిఫాబాద్): గిరిజనులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏకోపాధ్యాయ గిరిజన ప్రాథమిక పాఠశాలలు నిర్వహిస్తోంది. వాటి నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో ఆదివాసీలకు విద్య అందని ద్రాక్షగా మారుతోంది. తిర్యాణి మండలం గుండాల గ్రామ పంచాయతీ పరిధిలోని అర్జుగూడలోని గిరిజన సంక్షేమశాఖ ప్రాథమిక పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుడు రాజేశ్వర్ జూలై 6న మృతి చెందారు. ఇప్పటివరకు ఆయన స్థానంలో మరో ఉపాధ్యాయుడిని నియమించలేదు. అలాగే పూనగూడ స్కూల్‌లో పనిచేసే ఉపాధ్యాయురాలు శాంత ఇటీవల బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లారు. ఉపాధ్యాయులను నియమించకపోవడంతో ఈ రెండు పాఠశాలలు మూతబడ్డాయి. దాదాపు 40 మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యారు. ఈ విషయంపై ఎస్‌ఆర్పీ యశ్వంత్‌రావును వివరణ కోరగా.. ఉపాధ్యాయ ఖాళీలపై ఉన్నతాధికారులకు నివేదిక అందించామని తెలిపారు. ఖాళీ స్థానాల్లో ఇద్దరు టీచర్లు చేరుతారని వెల్లడించారు.


మూసిఉన్న అర్జుగూడ పాఠశాల

న్యూస్‌రీల్

అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారిగా ఎండీ సాదిక్

ఆసిఫాబాద్: జిల్లా అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారిగా ఎండీ సాదిక్ హుస్సేన్ నియమితులయ్యారు. మెదక్ జిల్లా నుంచి పదోన్నతిపై ఆయన జిల్లాకు బదిలీ అయ్యారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ రాష్ట్రంలోని పలువురు ఏఎస్‌వోలను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'ఆర్‌ఓఆర్ చట్టం- 2024'పై ప్రజాభిప్రాయ సేకరణ

ఆసిఫాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న నూతన ఆర్‌ఓఆర్ చట్టం–2024 ముసాయిదా బిల్లుపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అభిప్రాయాలను ఈ నెల 23లోగా https://ccla.telangana.gov.in లేదా.. ror2024&rev@telangana.gov.in ఈ– మెయిల్ ద్వారా.. సీసీఎల్‌ఏ కార్యాలయం, ల్యాండ్ లీగల్ సెల్, నాంపల్లి స్టేషన్‌రోడ్, అన్నపూర్ణ హోటల్ ఎదురుగా, అబిడ్స్, హైదరాబాద్– 500001 చిరునామాకు పోస్టు ద్వారా కూడా పంపించవచ్చని తెలిపారు. ఈ నెల 23న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని నిపుణులు సదస్సుకు హాజరై సూచనలివ్వాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు నేషనల్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు అక్టోబర్ 11 తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి నంబర్ 24న అర్హత పరీక్ష ఉంటుందని, అర్హత సాధిస్తే ఇంటర్ వరకు ఏటా స్కాలర్‌షిప్ వస్తుందని తెలిపారు.

అంబులెన్సుల సేవలు వినియోగించుకోవాలి


గర్భిణులతో మాట్లాడుతున్న సామ్రాట్

రెబ్బెన(ఆసిఫాబాద్): ఆపద సమయంలో వేగంగా వైద్యసేవలు పొందేందుకు 102, 108 అంబులెన్సుల సేవలు ప్రజలు వినియోగించుకోవాలని 102, 108 అంబులెన్సుల ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం అంబులెన్సులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చిన గర్భిణులతో మాట్లాడారు. 102 అంబులెన్సుల ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. సకాలంలో ఆస్పత్రికి తీసుకురావడం, చికిత్స, వైద్యపరీక్షల అనంతరం సురక్షితంగా ఇంటి దగ్గర వదిలిపెడుతున్నారా..? అని అడిగి తెలుసుకున్నారు. సేవలు బాగున్నాయని గర్భిణులు తెలపడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పైలెట్‌లు సంతోష్, నానయ్య, ఈఎంటీలు శ్రీకాంత్, పరుశురాం ఉన్నారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు, రైతులు

రెబ్బెన: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)లో రుణాల మంజూరులో జరిగిన అక్రమాలపై పూర్తి విచారణ జరిపించాలని మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, మాజీ సర్పంచ్ చెన్న సోమశేఖర్ డిమాండ్ చేశారు. రైతులతో కలిసి మంగళవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ పీఏసీఎస్‌లో సీఈవోగా విధులు నిర్వర్తిస్తున్న సంతోష్ రైతులకు సమాచారం ఇవ్వకుండా వారి పేర్లతో రుణాలను తీసుకున్నారని ఆరోపించారు. సిబ్బందితో కలిసి తప్పుడు పత్రాలు, సంతకాలతో నిరుపేద రైతులు రుణాలు తీసుకున్నట్లు సృష్టించారని తెలిపారు. 2004 నుంచి ఇప్పటివరకు అమలు చేస్తున్న రుణమాఫీ నగదుతోపాటు ఇన్‌పుట్ సబ్సిడీని కాజేశారని మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్యంతో ఎంతోమంది రుణమాఫీకి అర్హత కోల్పోవాల్సి వచ్చిందన్నారు. గౌడ సంఘం నాయకులు సుదర్శన్‌గౌడ్, మాజీ సర్పంచ్ గంటుమేర, రైతులు సంజీవ్ కుమార్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో ఆరుగురికి గాయాలు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గద్దెరాగిడి ఆర్‌ఆర్‌నగర్, చైతన్య నగర్‌లో మంగళవారం వీధి కుక్కలు స్వైర విహారం చేశారు. ఈ కాలనీల్లో ఆరుగురిపై దాడి చేసి గాయపరిచాయి. మున్సిపాలిటీ పరిధిలో కుక్కల దాడులు వరుసగా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు వాపోతున్నారు. నామమాత్రపు చర్యలతో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు.

గంజాయి సాగు చేస్తున్న ఒకరికి ఐదేళ్ల జైలు

ఆసిఫాబాద్: గంజాయి సాగు చేస్తున్న వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ మంగళవారం తీర్పు చెప్పారు. సీఐ సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌కు చెందిన చునార్కర్ ముకుందరావు తన పంట చేనులో పత్తితో పాటు గంజాయి సాగు చేస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు తేదీ:11.10.2021న ఎస్సై భూమన్న తనిఖీ చేయగా సుమారు 50 గంజాయి చెట్లు లభ్యమయ్యాయి. దీంతో అప్పటి సీఐ అశోక్ ముకుందరావుపై కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీడీవో, హెడ్‌కానిస్టేబుల్ బాబురావు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. ఈ కేసులో పీపీ జగన్మోహన్‌రావు వాదించారు.

ఆఫీస్ స్టాఫ్ ఉద్యోగులకు ఎఫ్‌ఎస్‌వోగా కన్వర్షన్



సీసీఎఫ్‌వోకు మొక్క ఇస్తున్న శాంతారాం

మంచిర్యాలక్రైం: జిల్లా అటవీశాఖ కార్యాలయంలో పని చేస్తున్న నలుగురు జూనియర్ అసిస్టెంట్లకు ఫీల్డ్ స్టాఫ్‌గా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా కన్వర్షన్ చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాళేశ్వరం జోన్-2 చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) బీ ప్రభాకర్ తొలిసారి జిల్లా అటవీశాఖ కార్యాలయానికి మంగళవారం వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక సీఎఫ్‌వో శాంతారాం పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. నలుగురు ఉద్యోగులకు ఈ నెల 21న గాందారి వనంలో శారీరక పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిసింది. కాగా, జిల్లా విభజన జరగక ముందు మంచిర్యాల ఎఫ్‌డీవోగా ప్రభాకర్ విధులు నిర్వహించారు. 2016లో జిల్లాల విభజన తర్వాత జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్‌వో) గా సుదీర్ఘకాలంగా పని చేశారు. అనంతరం ఆదిలాబాద్ సీఎఫ్‌వోగా ప్రమోషన్ పొంది ఆదిలాబాద్‌కు బదిలీపై వెళ్లి అక్కడ సీఎఫ్‌వోగా పని చేశారు. మళ్లీ ప్రమోషన్ పొందుతూ కాళేశ్వరం జోన్-2 సీసీఎఫ్‌వోగా పని చేస్తున్నారు. కాగా, తొలిసారి మంచిర్యాలకు రావడంపై జిల్లా అటవీశాఖ అధికారులు ఘనస్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ఆర్టీసీకి రాఖీ కళ

- ప్రయాణికులతో రద్దీగా బస్టాండ్లు
- సంస్థకు రికార్డుస్థాయి ఆదాయం
- పండుగ రోజే రూ.1.57 కోట్లు



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న ఆదిలాబాద్ బస్టాండ్

ఆదిలాబాద్/ఆసిఫాబాద్‌అర్బన్: రాఖీ పండుగను పురస్కరించుకుని ఆర్టీసీకి రికార్డు స్థాయి ఆదాయం సమకూరింది. మంగళవారం రాఖీ పండుగ నేపథ్యంలో తమ సోదరులకు రాఖీ కట్టేందుకు మహిళలు పెద్ద ఎత్తున బస్సుల్లో రాకపోకలు సాగించారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ లాంటి నగరాల నుంచి ప్రయాణికులు ఎక్కువగా ఉంటారు. ఉమ్మడి జిల్లాకు ఆనుకుని ఉన్న నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో బంధుత్వాలు ఎక్కువగా ఉండడంతో ఆయా ప్రాంతాల నుంచి ఇక్కడికి, ఇక్కడి నుంచి ఆయా జిల్లాలకు ఎక్కువగా ప్రయాణాలు చేయడంతో బస్సులు ప్రయాణికులతో నిండిపోయాయి. బస్సులు బస్టాండ్లలోకి రాకముందే ప్రయాణికులు వాటి కోసం పరిగెత్తాల్సి వచ్చిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. లక్ష్యానికి మించి ప్రయాణికులు ప్రయాణించడంతో రికార్డుస్థాయిలో ఆదాయం సమకూరింది. గతేడాది రాఖీ పండుగ రోజు ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో మొత్తంగా రూ.1.12 కోట్ల ఆదాయం రాగా, ఈసారి రూ.1.87 కోట్లు రావడం విశేషం. గతేడాదితో పోల్చితే 60శాతం ఆదాయం అధికంగా వచ్చింది. మొత్తంగా 17, 18, 19 తేదీల్లో బస్సులు 7,86,275 కిలోమీటర్లు ప్రయాణించాయి.

మహాలక్ష్ములకే పెద్దపీట

రాఖీ పండుగ కావడంతో ప్రయాణికుల్లో అత్యధికులు మహిళలే ఉన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో ఎంత దూరమైనా ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు రాష్ట్ర ప్రభుత్వం కల్పించడంతో సోదరులకు రాఖీలు కట్టడానికి మహిళలు దూర ప్రయాణమైనా ఆర్టీసీకే ప్రాధాన్యతనిచ్చారు. రీజియన్ పరిధిలో 17, 18, 19 తేదీల్లో 6,42,373 మంది ప్రయాణించగా, 3,69,763 మంది మాత్రమే టికెట్లకు డబ్బులు చెల్లించి ప్రయాణించారు. అంటే టికెట్ తీసుకున్న వారి కంటే మహాలక్ష్మి లబ్ధిదారులే రెట్టింపుగా ఉండడం గమనార్హం. అత్యధికంగా నిర్మల్ డిపో పరిధిలో 1,56,289 మంది మహాలక్ష్మి టికెట్‌పై ప్రయాణించారు. ఒక్క రాఖీ రోజే నిర్మల్ డిపో పరిధిలో 60 వేల మంది ప్రయాణించడం గమనించదగిన విషయం.

నిర్మల్, మంచిర్యాల పోటాపోటీ

ఆదాయం విషయంలో రీజియన్ పరిధిలో నిర్మల్, మంచిర్యాల డిపోలు పోటీపడ్డాయి. 17, 18,19 తేదీల్లో రూ.1.10 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకోగా, టార్గెట్‌ను అధిగమించి నిర్మల్ డిపో రూ.1.25 కోట్ల ఆదాయంతో మొదటి స్థానంలో నిలిచింది. ఇక మంచిర్యాల డిపో రూ.1.24 కోట్ల ఆదాయం సాధించింది. ఆదిలాబాద్ డిపో పరిధిలో రూ.1,00,80,479, ఆసిఫాబాద్ డిపో పరిధిలో రూ.74,98,361, భైంసా డిపో పరిధిలో రూ.52,05,368, ఉట్నూర్ డిపో పరిధిలో రూ.24,03,122 ఆదాయం సమకూరింది.

పకడ్బందీగా ముందుకెళ్తాం



గతంతో పోలిస్తే ఈసారి రాఖీ పండుగ సందర్భంగా భారీ రద్దీ కనిపించింది. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రీజియన్ పరిధిలో అన్ని బస్సు సర్వీసులను నడిపాము. ముఖ్యంగా మా సిబ్బంది ఎంతో శ్రమించి ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్య స్థానాలకు చేర్చారు. రికార్డు స్థాయిలో ఈసారి ప్రయాణికులు ప్రయాణించడంతో చిన్నపాటి ఇబ్బంది తలెత్తినా, ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా డ్రైవర్లు, కండక్టర్లు ఎంతగానో కష్టపడ్డారు. మున్ముందు ఇలాగే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా మరింత పకడ్బందీగా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తాం. అధిక ఆదాయాన్ని సమకూర్చిన కార్మికులకు అభినందనలు. ఇదే స్ఫూర్తితో మరింత బాధ్యతతో పనిచేయాలి.

– సోలోమన్, ఆర్టీసీ ఆర్‌ఎం, ఆదిలాబాద్

డాక్టరేట్ పొందడం అభినందనీయం



ప్రకాశంను సత్కరిస్తున్న కుమార్‌దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా వయోజన విద్యాశాఖ పరిధిలోని పీఆర్పీ రెడ్డిమల్ల ప్రకాశం సమాజసేవలో డాక్టరేట్ పొందడం అభినందనీయమని కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. సమాజ సేవలో నిమగ్నమై, సమాజ హితం కోరుతూ అందించిన సేవలకు గాను మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డు సంస్థ ద్వారా దేశ రాజధాని ఢిల్లీలో డాక్టరేట్ పొందిన రెడ్డిమల్ల ప్రకాశంను మంగళవారం కలెక్టర్ తన చాంబర్‌లో శాలువాతో సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాలుగా సమాజ హితం కోసం న్యాయవాద వృత్తిని చేపట్టి వయోజన విద్యలో విశిష్ట సేవలు అందించి డాక్టరేట్ పొందడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. భవిష్యత్‌లో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకుడు పోటు రవీందర్‌రెడ్డి, జిల్లా యువజన, క్రీడాధికారి కీర్తి రాజ్‌వీర్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, సఖీ లయన్స్ అధ్యక్షుడు బండ శాంకరి, డీఆర్పీ పోకల వెంకటేశ్వర్లు, సమన్వయకర్తలు గుండా సంధ్య, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వసతులు మెరుగుపరచాలి



కార్మికులతో మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: అన్ని గనులపై సౌకర్యాలు మెరుగుపరచాలని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఎస్సార్పీ-1 గనిని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు సమస్యలు తెలుపుతూ.. రెస్ట్‌హాల్స్ శుభ్రంగా ఉండడం లేదని, క్యాంటీన్లలో సరైన పౌష్టికాహారాన్ని అందించడం లేదని వాపోయారు. ఉద్యోగులు దుస్తులు, ఇతర సామగ్రి భద్రపరుచుకునేందుకు సరైన లాకర్లు లేవని పేర్కొన్నారు. అనంతరం శంకర్‌రావు మాట్లాడుతూ.. యాజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపించారు. ఉత్పత్తిపై ఉన్న ధ్యాస కార్మికుల సమస్యల పరిష్కారంపై ఏమాత్రం ఉండడం లేదని విమర్శించారు. ఈ సమస్యలపై ఉన్నతాధికారులతో మాట్లాడుతామని తెలిపారు. వారు స్పందించకుంటే కార్మికుల పక్షాన ఆందోళన చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, కేంద్ర కమిటీ నాయకులు తిరుపతి, రాజు, బ్రాంచ్ నాయకులు నీలం సదయ్య, మహేందర్‌రెడ్డి, రావుల అనిల్, మద్దెల వెంకటేశ్, నారాయణస్వామి, తిరుపతిరావు పాల్గొన్నారు.

మేనేజర్‌కు పరామర్శ..

ఎస్సార్పీ-1 గని మేనేజర్ విజయ్‌కుమార్‌ను యూనియన్ నాయకులు పరామర్శించారు సీసీసీలోని ఆయన ఇంటికి వెళ్లారు. ఇటీవల ఢిల్లీలో వరద ప్రమాదంలో సివిల్ శిక్షణ కేంద్రంలో విజయ్‌కుమార్ కూతురు తానియా మృతి చెందిన సంగతి తెలిసిందే. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

క్యాడర్ స్కీంను పరిష్కరించాలి



ట్రేడ్స్‌మెన్లతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేతలు

శ్రీరాంపూర్: క్యాడర్ స్కీంను పరిష్కరించాలని గుర్తింపు సంఘం నాయకులను ట్రేడ్స్‌మెన్లు కోరారు. గుర్తింపు సంఘం నాయకులు మంగళవారం ఆర్కే 7 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా ట్రేడ్స్‌మెన్లు వారు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. ట్రేడ్స్‌మెన్లు అండర్‌గ్రౌండ్‌లో అన్‌ఫిట్ అయ్యి సర్ఫేస్ రాస్తే వారికి సూటబుల్ జాబ్ ఇవ్వాలని కోరారు. ఇతర సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ సెక్రటరీ ఎస్కే బాజీసైదా మాట్లాడారు. మేనేజర్‌తో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కంపెనీ ఉద్యోగుల పర్సనల్ రికార్డు వివరాలు తెలుసుకునేందుకు కొత్తగా ఏర్పాటు చేసిన పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని, పొరపాట్లు ఉంటే సరిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, పిట్ కార్యదర్శి బేర రవీందర్, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, తిరుపతి, సురేశ్, పవన్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో తాగునీటి తండ్లాట

- రోజూ రాని గోదావరి జలాలు
- సరిగా పని చేయని మోటర్లు
- అవస్థల్లో కార్మిక కుటుంబాలు



శాంతిఖని వద్ద నిర్మించిన గోదారి వాటర్ ఫిల్టర్ బెడ్

బెల్లంపల్లి: బొగ్గుగనిలో దిగి రక్తాన్ని చెమటగా మార్చి బొగ్గు ఉత్పత్తి చేస్తున్న కార్మికులకు గోదారినీళ్ల గొంతు తడపడం లేదు. రోజువారీగా గోదారి నీళ్ల సరఫరా కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్మిక క్షేత్రం బెల్లంపల్లిలో పక్షం రోజుల పైబడి గోదారి జలాలు సరిగా సరఫరా కావడం లేదు. వారంలో ఒకటి, రెండు రోజులు అరకొరగా సరఫరా చేసి చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలున్నాయి. ఈ ప్రతికూల పరిస్థితుల్లో తాగునీటి కోసం కార్మిక కుటుంబాలు తీవ్రంగా తపిస్తున్నాయి. కార్మిక కుటుంబాలు పడుతున్న తాగునీటి కష్టాలను సింగరేణి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత మీద ఉన్న ధ్యాస కార్మికులకు సౌకర్యాలు కల్పించడంలేదనే విమర్శలున్నాయి.

పట్టింపు కరువు

శుద్ధి చేసిన గోదావరి జలాలు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా సరఫరా కాకపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. సింగరేణి అధికారులు, కార్మిక సంఘాల నాయకులు పట్టించుకోవడంలేదు. ఆ సమస్యవైపు దృష్టి మళ్లించడం లేదు. గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ, రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ అనుబంధ సంఘంగా ఉన్న ఐఎన్‌టీయూసీతో పాటు బీఆర్‌ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ కార్మిక సంఘం తదితర సంఘాలు నోరు మెదపడం లేదు. ప్రభుత్వం లేదా సింగరేణి యాజమాన్యం కార్మికుల కోసం ఏదైన నిర్ణయం తీసుకుంటే అది తామే చేశామని గోరంతలు కొండంతలుగా చెప్పుకొనే ప్రధాన కార్మిక సంఘాల నాయకులు చేష్టలుడిగి చోద్యం చూస్తున్నాయనే విమర్శలను మూట గట్టుకుంటున్నాయి. అదే తీరుగా సింగరేణి అధికారులు వ్యవహరిస్తుండటంతో బెల్లంపల్లి కార్మికులు గోదారి నీటి కష్టాలను నుభవిస్తున్నారు. ఈ విషయమై బెల్లంపల్లి సివిల్ విభాగం సూపర్ వైజర్ సతీశ్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. పక్షం రోజుల నుంచి రోజువారీగా గోదారి జలాలు సరఫరా కావడం లేదని తెలిపారు. ఈ కారణంగా కార్మిక కుటుంబాలకు తాగునీరు సరఫరా చేయడంలో ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. సమస్య తీవ్రతను అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.

గోదావరి జలాల కోసం..

కార్మిక కుటంబాలకు గోదారి జలాల సరఫరా కోసం సింగరేణి యాజమాన్యం నస్పూర్ శివారులోని గోదావరి ఒడ్డున ఇంటక్‌వెల్ నిర్మించింది. అక్కడి నుంచి శ్రీరాంపూర్, నస్పూర్, రామకృష్ణాపూర్, మందమర్రి, బెల్లంపల్లి కార్మిక క్షేత్రాలకు గోదారి జలాలను సరఫరా చేయడానికి ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేశారు. వీటిలో మందమర్రి ఫిల్టర్‌బెడ్ నుంచి బెల్లంపల్లిలోని శాంతిఖని ఫిల్టర్‌బెడ్‌కు రోజువారీగా గోదారి జలాలు సరఫరా చేయాల్సి ఉండగా తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నట్లు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందమర్రిలో నివాసముంటున్న కార్మిక కుటుంబాలకు పూర్తిస్థాయిలో గోదారి జలాలు సరఫరా అయ్యాక మిగిలిన కొద్దిపాటి నీటిని అతికష్టంగా, అయిష్టంగా సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. అదికూడా రెగ్యులర్‌గా నీటి సరఫరా జరగడం లేదని ఫిల్టర్ బెడ్ నిర్వాహకులు చెబుతున్నారు.

రోజుకు 10 గంటలు పంపు పనిచేయాల్సి ఉండగా..

మందమర్రి ఫిల్టర్‌బెడ్ వద్ద బెల్లంపల్లికి గోదారి జలాల సరఫరా కోసం ప్రత్యేకంగా రెండు పంపు మోటార్లు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. వీటి ద్వారా శాంతిఖని ఫిల్టర్‌బెడ్‌కు క్రమం తప్పకుండా రోజువారీగా నీటిని చేరవేయాల్సి ఉండగా అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. రోజుకు గరిష్ఠంగా 10 గంటలకు తగ్గకుండా పంపు మోటర్లను నడిపించి తాగునీటిని ఫిల్టర్‌బెడ్‌కు పంపించాల్సి ఉండగా ఆ సిస్టంను పాటించడం లేదు. నాలుగైదు గంటలకు మించి పంపు మోటర్లను నడిపించడం లేదని, ఈ కారణంగా శాంతిఖని వద్ద నిర్మించిన 7లక్షల గ్యాలన్ల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన గోదారి వాటర్ ఫిల్టర్ బెడ్‌కు అరకొరగా నీటి సరఫరా జరిగి తాగునీటి కటకట ఏర్పడుతోంది. దీంతో బెల్లంపల్లిలోని కార్మిక కుటుంబాలకు వారానికోసా కూడా గోదారి జలాలను సరఫరా చేయని పరిస్థితులున్నాయి.

యథేచ్ఛగా మొరం తవ్వకాలు



పొక్లెయిన్‌తో తవ్విన ప్రదేశం

దండేపల్లి: మండలంలోని గూడెం గుట్టల్లో మొరం తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. రాత్రి వేళ పొక్లెయిన్లతో తవ్వకాలు జరిపి మొరాన్ని టిప్పర్లలో తరలిస్తున్నారు. అధికారుల నిఘా లేక అక్రమ దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. దీంతో ఎత్తయిన గుట్టలు నేలమట్టమవుతున్నాయి. అధికారులు స్పందించి మొరం తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ సంధ్యారాణిని సంప్రదించగా, గూడెం గుట్టల్లో మొరం తవ్వకాలకు ఎవరికి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. విషయాన్ని మైనింగ్ అధికారులకు తెలిపి పోలీసుల సహకారంతో మొరం తవ్వకాలకు అడ్డుకట్ట వేస్తామని చెప్పారు.

ఆపదలో ఉన్న దంపతులకు ఆర్థికసాయం

సాక్షి ఎఫెక్ట్..



కిరణ్ దంపతులకు నగదు ఇస్తున్న సంతోష్‌కుమార్

చెన్నూర్: చెన్నూర్ పట్టణానికి చెందిన చకినారపు స్రవంతికి కేవలం 800 గ్రాములతో ఆడ శిశువు జన్మించింది. పాపను బతికించుకునేందుకు నిరుపేద కిరణ్, స్రవంతి దంపతులు ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్న విషయాన్ని గత మంగళవారం 'నిరుపేదకు పెద్ద ఆపద' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి దాతలు వివిధ రూపాల్లో స్పందించి తోచిన సాయం అందిస్తున్నారు. చెన్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు చెన్నూర్ గ్రేట్ గాయ్స్ అనే వాట్సప్ గ్రూప్ నిర్వహిస్తున్నారు. చెన్నూర్ గ్రేట్ గాయ్స్ ఆధ్వర్యంలో నాధంగారి సంతోష్‌కుమార్ మంగళవారం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో కిరణ్, స్రవంతి దంపతులకు రూ.13,001 ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్, స్రవంతి దంపతులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

'ఆరోపణల్లో నిజం లేదు'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జాతీయ రహదారి 63అలైన్‌మెంటు మార్పులో తనకేం సంబంధం లేకున్నా కొందరు రాజకీయంగా దెబ్బతీసేందుకే అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయనపై వచ్చిన ఆరోపణలపై స్పందించారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పర్యటనలో ఎన్‌హెచ్-63 బాధితులు వినతులు ఇచ్చారని తెలిపారు. కొందరు తన ప్రమేయంతో గత అలైన్‌మెంటు మార్చినట్లు బాధితులను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తూ రాజకీయంగా ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. తాను భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని ఢిల్లీ వెళ్లి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని మాజీ ఎంపీ వెంకటేష్ నేతతో కలిసి విన్నవించామని గుర్తు చేశారు. అంతేకాక ఆర్వోను కూడా కలిసి పలుమార్లు కోరినట్లు తెలిపారు. కానీ కొందరు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, ఇలాంటివి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ ఆరోపణలను ఖండిస్తున్నానని తెలిపారు.

బీసీ యువతకు ఉచిత శిక్షణ

మంచిర్యాలటౌన్: వెనుకబడిన తరగతుల నిరుద్యోగ అభ్యర్థులకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి బీ వినోద్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్‌జీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ, ఈసీఐఎల్, కుషాయిగూడ, హైదరాబాద్ సౌజన్యంతో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణలో 90 శాతానికి పైగా హాజరు నమోదైన అభ్యర్థికి నెలకు రూ.4వేల చొప్పున, మూడు నెలల పాటు భోజనం, స్టడీ మెటీరియల్, బేసిక్ టూల్ కిట్, బ్యాగ్, టీషర్టులను అందించనున్నట్లు తెలిపారు. 10వ తరగతి/ఐటీఐ/డిప్లొమా/ఒకేషనల్‌లో ఉత్తీర్ణత కలిగిన విద్యార్హతతో 18-25 సంవత్సరాలు వయస్సున్నవారు రూ.5లక్షలకు మించకుండా కుటుంబ వార్షికాదాయం కలిగి ఉండాలని పేర్కొన్నారు. 10వ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందని తెలిపారు. రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషిన్, డిష్ వాషర్, ఎయిర్ కండీషనర్ రిపేర్, ఇన్‌స్టాలేషన్, గ్యాస్ చార్జింగ్, ఎల్‌టీవీ, ఓఎల్‌ఈడీ మానిటర్, మైక్రోవేవ్ ఓవెన్, వాటర్ ప్యూరిఫయర్, బేసిక్ హెచ్‌ఆర్ రిపేర్-ఇన్‌స్టాలేషన్ కోర్సులలో ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో www. tgbcstudycircle. cgg. gov. in లో ఈ నెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని, కోర్సు పూర్తి చేసినవారికి సర్టిఫికెట్ ఇచ్చి ప్లేస్‌మెంట్ కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

బాసర: బాసర గోదావరి నది వద్ద ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఏఎస్సై ఉజ్వల తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోటగల్లికి చెందిన స్వప్న మంగళవారం బాసర గోదావరి నది వద్దకు వచ్చి ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు ఆమెను కాపాడి స్థానిక ఠాణాకు తీసుకువెళ్లగా ఏఎస్సై కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. స్వప్న ఆత్మహత్యాయత్నానికి కుటుంబ సమస్యలే కారణమని తెలిసింది.

లక్ష్య సాధనకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

- ఇన్‌చార్జి జీఎం టీ శ్రీనివాస్



అధికారులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

శ్రీరాంపూర్: వచ్చే ఆర్థిక సంవత్సరం శ్రీరాంపూర్ ఏరియా సాధించాల్సిన ఉత్పత్తి లక్ష్యాలపై తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం టీ శ్రీనివాస్ తెలిపారు. సీసీసీలోని సింగరేణి గెస్టుహౌస్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం అన్యువల్ ప్లాన్ కమిటీ, కార్పొరేట్ ఐఅండ్‌పీఎం కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఆర్థిక సంవత్సరం శ్రీరాంపూర్ ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను నూరు శాతం సాధించాలన్నారు. దీని కోసం తగిన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఉత్పత్తికి అవసరమైన యంత్రాలు, యంత్ర సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మంచి ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా కోసం తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. అన్యువల్ ప్లాన్ కమిటీ అధ్యక్షుడు రవికుమార్, ఎస్వోటూ జీఎం సత్యనారాయణ, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి ఏవీ రెడ్డి, ఏజెంట్లు గోపాల్‌సింగ్, శ్రీధర్, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్‌కుమార్, ఏరియా స్టోర్స్ డీజీఎం మల్లయ్య, ఏరియా క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డితోపాటు కార్పొరేట్ అధికారులు పాల్గొన్నారు.

'హాస్టల్ సిబ్బంది తప్పులేదు'



విద్యార్థి తండ్రి ప్రవీణ్

రామకృష్ణాపూర్: రాఖీ పండుగ సందర్భంగా రామకృష్ణాపూర్ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల సిబ్బంది తప్పుగా వ్యవహరించలేదని విద్యార్థినులు దాసరి సహస్ర, అశ్విక తండ్రి ప్రవీణ్‌కుమార్ తెలిపాడు. సోమవారం రాఖీ పండుగకు తన కుమారుడు జితేంద్రకు కూతుళ్లిద్దరితో రాఖీ కట్టిద్దామని హాస్టల్ వద్దకు వెళ్లగా జనం ఎక్కువగా ఉన్నారని పేర్కొన్నాడు. దీంతో తానే తన కుమారుడిని భుజాన ఎత్తుకుని కిటికీలో నుంచి తన కూతుళ్లతో రాఖీ కట్టించానని మంగళవారం విడుదల చేసిన ఓ వీడియోలో తెలిపాడు. తన సోదరుడికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో త్వరగా వెళ్లాలన్న ఉద్దేశంతో కిటికీ దగ్గరికి వెళ్లి రాఖీ కట్టించానని పేర్కొన్నాడు. రాఖీ కట్టిన వీడియో తీసుకుని వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకుంటే ఎవరో కావాలని వైరల్ చేశారని పేర్కొన్నాడు. ఈ విషయంలో హాస్టల్ సిబ్బంది తప్పేమీ లేదని వివరించాడు.

బదిలీల కోసం కౌన్సెలింగ్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ వీటీసీలో ఈపీ ఫిట్టర్లకు బదిలీలపై మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియా పరిధిలో పనిచేస్తున్న 20 మంది ఈపీ ఫిట్టర్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోగా కొత్తగూడెం నుంచి వెబ్ కౌన్సెలింగ్ ద్వారా అధికారులు బదిలీ చేశారు. 19మంది ఈ ప్రక్రియ ద్వారా వివిధ ఏరియాలకు బదిలీ అయ్యారు. ఇందులో కొంత మంది స్వాప్ ఆప్షన్ ద్వారా కూడా పోస్టింగ్‌లు పొందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఎస్వోటూజీఎం సత్యనారాయణ, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవి, వీటీసీ మేనేజర్ వెంకటరామారావు, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్‌లో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు